# పెళ్ళి చేసి(కొని) చూడు!

....రమాదేవి జాస్తి....

**"మా బలరాం అన్నయ్య, పెదనాన్నా వస్తున్నామని ఉత్తరం రాశారు."**

**భయపడుతూ చెప్పిన గంగాధరాన్ని సుందరి అడిగిన మొదటి ప్రశ్న "మీ బలరామన్నయ్యంటే మన పెళ్ళిలో చూశాను. తెల్లగా, ఎత్తుగా, ఉంగరాల జుట్టుతో అచ్చం సిన్మా హీరోలా ఉన్నాడని మా వాళ్లంతా చాలా కాలం పాటు చెప్పుకున్నారు, ఆయనేనా ?" అని.**

ఎప్పుడో పదిహేనేళ్లనాడు అందులోనూ తన పెళ్లిలోనే చూసిన అన్నగారిని భార్య అంత బాగా గుర్తు పెట్టుకోవడం గంగాధరాని కంతగా రుచించ లేదు. అందుకే 'వూ' అన్నాడు ముభావంగా.

అర్థమైంది సుందరికి "ఏవిఁటలాగయ్యేరు ? మీ అన్నగారిని 'హీరో' అన్ననా? మీరు మాత్రం తక్కువా ఏమిటి ? రాజుగారి పెద్ద భార్య అందగత్తె అంటే దానర్థం చిన్న భార్య కురూపనా ?" ముద్దుగా భర్త బుగ్గలు సాగదీసి నవ్వింది.

'ఈ రోజెందుకో సుందరి మంచి 'మూడ్'లో ఉన్నట్లుంది. ఎప్పటి మాదిరి తనవైపు వాళ్లంటేనే ముఖం చిట్లింపులు, మూతి విరుపులు, సన్నాయి నొక్కులకి బదులు సరస సంభాషణలా?' మతి పోతోంది గంగాధరానికి. అనుమానం తీరక అడిగేశాడు.

"మా వాళ్ళొస్తున్నారంటే నువ్వెప్పుడూ విసుక్కుంటావుగా ?"

'అఁ, పోదురూ ! మరీ చెప్తారు. పెళ్ళయి పదిహేనేళ్ళయినా ఇంకా మీ వాళ్ళు, మా వాళ్ళు ఏమిటండీ ? అంతా మనవాళ్ళు కారా ఏమిటి ?' సుందరి ప్రదర్శిస్తున్న హృదయ వైశాల్యానికి భయం వేసింది గంగాధర్‌కి. ఏదైన 'తోక' తగుల్తుందేమో, ఆలోచన్ల గోదారినీదుదామని ప్రయత్నించ సాగేడు.

అతనా ప్రయత్నంలో ఉండగానే వేడి వేడి కాఫీ కప్పు చేతికిచ్చి అతనెదురుగా స్థిమితంగా కూర్చుంటూ అడిగింది సుందరి. "ఇంతకీ ఎప్పుడొస్తున్నారట మీ అన్నగారు?"

"మరో పదిహేన్రోజుల్లో. అన్నయ్య కిక్కడ ఓ వారం రోజుల ట్రైనింగ్ ఉన్నదట. మా పెదనాన్న ఒక్కరికీ తోచదని ఆయన కూడా వచ్చి ఇక్కడ నాలుగు ప్రదేశాలూ చూస్తానన్నారట. మనకేదైనా ఇబ్బంది వుంటే గనుక వెంటనే తెలియచేయమని, అట్లాగైతే హోటల్లో దిగగలమని రాశారు".

భలే వారేనండీ, ఊర్లో మనం ఉండగా ఆయనెక్కడో హోటల్లో దిగడం ఏం ఖర్మ? చక్కగా ఆ వారం రోజులూ మనంట్లోనే వుండమని రాయండి. మనకు ఇబ్బంది లేదు. చాలా సంతోషం వాళ్ళొస్తే అని కూడా రాయండి. వాళ్ళు మన గృహ ప్రవేశానికి కూడా రాలేదు కదా ?!"

గంగాధరం తలూపేడు కాఫీ త్రాగుతూ. వంట ప్రయత్నంలో లోపలికెళ్ళబోతూ మళ్ళీ చెప్పింది సుందరి "మీరు రేపు ఆఫీస్‌కి వెళ్ళగానే ఉత్తరం రాసి పోస్టులో వేయండి. ఆ ఉత్తరం సరిగా చేరుతుందో, లేదో ? ఎందుకైనా మంచిది. మీ కాయన ఆఫీస్ ఫోన్ నెంబర్ తెలిసుంటే ఫోన్ చేసి చెప్పేయండి తప్పకుండా మనింటికే రమ్మని."

గంగాధరం నిలువు గుడ్లేసుకు చూస్తుండగా, సుందరి కూనిరాగం తీస్తూ ఖాళీ కప్పు తీసుకుని లోపలి కెళ్ళింది. "ఏమిటి సుందరి ఆసక్తికీ, ఉత్సాహానికీ కారణం ? అన్నగారి 'అందం' ఆమెనంతగా ఆకర్షించిందా ? "గంగాధరం ఉలికి పడ్డాడు". ఛీఛీ సుందరి అట్లాంటి మనిషి కాదు. సందేహించనక్ఖర్లేని మహా సాధ్వి. మరి ? పోనిద్దూ 'టైం' వచ్చినపుడు అదే తెలుస్తుంది" అనుకున్నాడు గంగాధరం ఇక బుర్ర బద్దలు కొట్టుకోలేక.

అదృష్టవశాత్తూ ఆ 'టైం' ఆ రాత్రికే వచ్చింది గంగాధరానికి.

ఆ రాత్రి పిల్లల్ని త్వరగా నిద్రపుచ్చేసి, బారెడు నన్నజాజుల దండ తల్లో తురుముకుని, తమలపాకుల పళ్ళెంతో గదిలో కొచ్చింది సుందరి. సాయంత్రం నుండీ ఆశ్చర్యపడీ, పడీ - ఇంక పడేందుక్కూడా ఓపిక లేక అలా చూస్తుండిపోయిన మొగుడి పక్కనే మంచం మీద సర్దుక్కూచుంటూ, ప్రారంభించింది.

"ఏమండీ, నిద్రపోతున్నారా ?"

'కళ్ళు పత్తికాయల్లా మరీ తెరుచుకు చూస్తుంటే అట్లా అడుగుతుందేమిటి ?' గంగాధరానికీ తిక్క పుట్టుకొచ్చింది.

"లేదు సుందరీ ! పప్పు రుబ్బుతున్నా." జవాబిచ్చేడు.

"ఛీ పాడు, అన్నీ పాడు జోకులే. కన్పించరు గాని, వొళ్లి, చిలిపి మనిషి," తాంబూలం మొగుడి నోట్లో పెట్టి, బుగ్గ మీదొక్కటి సుతారంగా పొడిచింది సుందరి, సిగ్గుగా నవ్వుతూ.

తనన్నదాంట్లో జోకేముందో గంగాధరానికి అర్థం కాలేదు. కానీ, 'సిగ్గు' చూశాక స్ఫురించి, "వార్నాయనో, ఈ తెలుగు సిన్మాల పుణ్యమా ఏం మాట్లాడినా బూతైపోతోంది. ఖర్మ" అనుకున్నాడు లోపల్లోపలే జుట్టు పీక్కుంటూ.

"అవునూ, మీ అన్నయ్య ఒక్కరే సంతానం కదండీ, మీ పెదనాన్న గారికి ?" సుందరి సిగ్గుల్లోంచి బయటపడ్తూ ఆరాగా అడిగింది.

'ఇంక పడకమీద కూడా అన్నయ్య నొదలవా?' అని కోప్పడాలన్పించినా, మళ్ళీ అందులో ఏం అర్థం వస్తుందో, సరసం కాస్తా విరసం కాగలదని అగిపోయేడు గంగాధరం "వూ" అన్నాడు కసిగా తాంబూలం నములుతూ.

"పాపం చిన్నప్పుడే తల్లిపోయినా ఆయనే పెంచారట కదా మీ అన్న గార్ని ?" సుందరి జాలి ప్రదర్శించింది. పెద తండ్రి గుర్తు రాగానే మనసు నిండా ఆత్మీయత పొంగింది గంగాధరానికి.

సవతి తల్లి పిల్లవాడిని బాగా చూస్తుందో, లేదోనన్న భయంతో ఎవరెంత చెప్పినా వినకుండా పెదనాన్న ఒంటరిగానే వుండిపోయేరు కొడుకుని పెంచుతూ. తన ఊర్లో కాలేజి లేకపోవటంతో తనుకూడా పెదనాన్న దగ్గరే ఉండి చదువుకున్నాడు. తనని తండ్రి హాస్టల్లో ఉంచుతానంటే పెదనాన్న అన్నయ్య ఇద్దరూ ఒప్పుకోలేదు. అన్నయ్య తనకన్నా ఓ రెండు మూడేళ్ళు పెద్దవాడు. తామిద్దరూ ఎంతో అన్యోన్యంగా, స్నేహంగా కలిసి మెలిసి తిరిగేవాళ్ళు.

భార్య అందిస్తున్న తమలపాకులు నవుల్తూ 'కథ'లా చెప్పుకొచ్చేడు. గంగాధరం తన అనుబంధం గురించి - ఇదంతా ఎక్కడికి దారి తీయబోతోందో తెలీని అజ్ఞానంలో మునిగిపోయి.

"మీ అన్నయ్యకి లవ్ ఎఫైర్ ఏమైనా బెడిసి కొట్టిందా ?" సుందరి కుతూహలంగా అడిగింది.

"ఛా, అలాంటిదేం లేదు. మా అన్నయ్య ఎన్నడూ ఆడపిల్లలకేసి కన్నెత్తయినా చూసేవాడు కాదు." గర్వంగా చెప్పేడు గంగాధరం.

'మరీ పెళ్ళెందుకు చేసుకోలేదు ? మీ పెదనాన్న కూడా అలా వదిలేసేరేమిటి కొడుకుని?'

"మా అన్నయ్యకి మొదటి నుండీ పెళ్ళి, సంసార జీవితాల మీద వ్యామోహం లేదు. మా పెదనాన్నకి అన్నయ్యని ఏ విషయంలోనూ బలవంతం చేసే

అలవాటు లేదు."

హఠాత్తుగా గుర్తొచ్చి, దీనంగా అడిగేడు "సుందరీ, ఇంకా ఎన్ని కట్టల తమల పాకులు మిగిలినయ్ ? తెల్లవార్లూ నాకీ 'మేక' పనేనా ?'

సుందరీ చిరునవ్వు నవ్వి, వళ్ళెం కిటికీలో పెట్టేసి, లైటార్పి బెడ్‌లైట్ వేసింది. మరో అరగంట తర్వాత విశ్రాంతిగా పడుకుని



# పెళ్ళి చేసి (కొని) చూడు!

## ...రమాదేవి జాస్తి...

సేదతీరుతోన్న మొగుడి గుండెల మీద మృదువుగా రాస్తూ, గోముగా అడిగింది సుందరి. "ఏమండీ, మీకు మా ఊర్వశి అక్కయ్య గుర్తున్నదా?"

గంగాధరం ఇంకా మత్తులోంచి తేరుకోలేదు.

"ఏ ఊర్వశి ? నేనిందాక 'స్వర్గం' అని కాని అన్నానా ఏమిటి ?"

'ఛీ, మీరివాళ అన్నీ పాడు జోకులే వేస్తున్నారు' ముద్దుగా ఒక్కటిచ్చింది సుందరి.

గంగాధరానికి తెలివొచ్చింది. ఎక్కడో, ఏదో 'లింకు' అందుతోన్నట్లు అన్పించింది. "ఇంతకీ ఎవరా ఊర్వశీ?"

"అదేనండి, మాకు దూరపు చుట్టరికమే అయినా మన గృహ ప్రవేశానికి కూడా వచ్చింది. ఎర్రగా, బాగానే ఉంటుంది. మీరు చూశారు కూడా!" మొగుడికి జ్ఞాపకం తెచ్చుకునేందుకు టైమిచ్చింది సుందరి.

"వ్వూ, ఎర్రగా, బుర్రగా ఉన్న వాళ్లందర్నీ గుర్తు పెట్టుకోవడం తప్ప నాకింక పన్లేదేమిటి?" గంగాధరం ఎత్తిపొడిచేడు.

సుందరి గ్రహించినా, పట్టించుకోకుండా అడిగింది. "పోన్లెండి కానీ, మీ అన్నయ్యకీ, మా అక్కయ్యకీ పెళ్ళి చేస్తే ఎట్లా ఉంటుంది?"

ఇప్పుడర్థమైంది గంగాధరానికి భార్య ఎత్తుగడ. చాణక్యుడి బుర్ర కాదూ?! గంగాధరం ఏమీ మాట్లాడకపోవడం చూసి మళ్ళీ అన్నది సుందరి "మా ఊర్వశి అక్కయ్యకి ముప్ఫయ్ అయిదు ఏళ్ళున్నా అంతలా కన్పించదు. పాతికేళ్ళంటే నమ్మొచ్చుననుకోండి. తండ్రి లేడు. అన్నదమ్ములు సరిగా పట్టించుకోక ఇంకా పెళ్ళి కాలేదు తనకి. పని పాటలు బ్రహ్మాండంగా చేస్తుంది."

"మనం చేసుకోండి అని చెప్పగానే వాళ్ళు చేసుకోవద్దూ ? అయినా మా అన్నయ్య కిపుడు నలభయ్యేళ్ళు. ఇంతకాలం హాయిగా బ్రతికినవాడు ఇప్పుడీ ఝంఝూటాలకి ఒప్పుకుంటాడా?" గంగాధరం సందేహపడ్డాడు.

"మగవాడి వయసు లెక్కేముంది ? అసలు మన పెళ్ళిలో మీ అన్నయ్యని చూసి అందరూ ఇరవయ్యేళ్ళవాడనుకున్నార్ట. ఇప్పుడూ అలాగే ఉండి వుండాలి. చీకూ - చింతా లేదు కాబట్టి."

"ఏమిటి - ఇరవైలానా?" గంగాధరానికి వొళ్ళు మండుతోంది.

"ఇరవై కాపోతే ముప్పై. ఇంతకాలం ఆయన హాయిగా బ్రతికాడూ అంటే పెళ్లయిన వాళ్లంతా హాయిగా బ్రతకడం లేదనా మీ అభిప్రాయం? ఇప్పుడు మీరు హాయిగా లేరా?" సుందరి నిలదీసింది.

మూడొంతులు తన మీదికి వాలిపోయి వున్న అర్ధాంగి అలా కళ్ళలో కళ్ళు పెట్టి 'హాయిగా లేవూ?' అనడిగితే, చెదిరి వున్న ఆమె బొట్టు, జుట్టూ సాక్షిగా - గంగాధరం అబద్ధం చెప్పలేకపోయేడు. ఏ మొగుడు మాత్రం చెప్పగలడని? పైగా, ఎర్రబడ్డ సుందరి ముక్కు ప్రమాద 'సూచిక'గా తోచింది గంగాధరానికి.

"అందరూ నాఅంత అదృష్టవంతులుం డొద్దూ?" గొప్ప తెలివితో ఆ చిక్కు నుండి బయటపడిపోయేడు గంగాధరం.

సుందరి మెత్తబడింది.

"అది కాదండీ, మా అక్కయ్య కూడా చాలా మంచిదే నాలాగ. ఏదో మనిద్దరం పూనుకుని వాళ్ళనో ఇంటివాళ్లని చేసామనుకోండి. మన పుణ్యమాని వాళ్ళూ సుఖంగా బ్రతుకుతారు. మీ పెదనాన్నగారు సంతోషిస్తారు. ఆయన మీకు వండి పెట్టినందుకు మీరాయన ఋణం తీర్చుకున్నవారవుతారు" అనునయంగా చెప్పింది.

గంగాధరం ఆలోచనలో పడ్డాడు. అతడికి భార్య చెప్పిన ఆఖరు పాయింట్ బాగా నచ్చింది. పాపం, ఈ వయసులో కూడా ఆయనే చెయ్యి కాల్చుకుంటున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం దివ్యంగానే వున్నా, తర్వాత్తర్వాతి సంగతేమిటి? ఆ ఇద్దరిలో ఎవరికి సుస్తీ చేసినా కష్టమే. ఆడ దిక్కులేని సంసారమాయె-

'మీకెందుకు, మీరు 'సరే' నవండి. నేను వాళ్ళొచ్చేప్పటికి మా అక్కయ్య కూడా ఇక్కడే ఉండేలా ఏర్పాటు చేస్తాను. కాస్త ఇద్దరూ దగ్గరగా మసలేలా చూసామంటే చాలు, వాళ్లే దార్లోకొస్తారు' అన్నది సుందరి ఎంతో తేలిగ్గా చిటికెల మీద తేల్చేస్తూ. భర్త మెత్తబడుతోన్న సంగతి గ్రహించేసింది మరి.

"నిజమే అనుకో. కానీ, అది అంత తేలికైన విషయమంటావా? మా అన్నయ్య కొంచెం సీరియస్ టైపు మనిషి కూడాను" గంగాధరానికి భయంగా ఉంది - అన్నగారికి కోపం వస్తుందేమోనని.

సుందరి ధైర్యం చెప్పింది.

"మనం చేసేది మంచిపనే కదా?! మన ఇల్లు, వాకిలీ, పిల్లలూ, మన అన్యోన్యత - ఇవన్నీ చూసి ఆయనకీ సంసారమంటే మోజు కలిగేలా మనం చేయాలి. ఇంక అక్కయ్య పని ఆయన మనసుని ఆకట్టుకోడమే. నేను తనకి సలహాలిస్తాన్లే ఈ విషయంలో".

"నిజమే ననుకో..." గంగాధరం నసిగేడు. రాక రాక వస్తున్న వాళ్లపై ఇట్లాంటి ప్రయోగాలు చెయ్యడం బావుండదేమో అన్పిస్తోంది అతడికి.

'అనుకో గినుకో ఏం లేదు - మీ పని వినుకోవడమే. మీరు మాత్రం నాకు ఫుల్ కో-ఆపరేషన్ ఇవ్వండి, చాలు. మీ అన్నయ్య ఎట్లా దారికి రాడో నేను, మా అక్కయ్య చూస్తాం. విశ్వామిత్రుడంతటి వాడే పడిపోయాడు మేనక ధాటికి. పొయ్యి వేడికి కరగని వెన్న వుంటుందా?' సుందరి కొంటెగా నవ్వింది.

"ఇంతకీ ఈ మీ ఊర్వశే ఆనాటి మేనకనా ఏమిటి?" గంగాధరం అనుమానించేడు.

"మీ జోక్స్‌కి తర్వాత నవ్వుతాను కాని మీ కో-ఆపరేషన్ విషయం చెప్పండి," గుర్తు చేసింది సుందరి.

ఓ.కే. చెప్పకుంటే ఆ తర్వాత ఎదుర్కోవల్సి వచ్చే సుందరి 'నాన్-కోఆపరేషన్' గుర్తొచ్చి - బుద్ధిగా తలూపాడె గంగాధరం.

ఆ మర్నాడే సుందరి అక్కగారిని పిలిపించడం పదిహేనురోజుల్లో నేర్పాల్సినవి నేర్పడం జరిగిపోయింది. ఇంక మరుసటి రోజు బలరాం వాళ్లు వస్తారనగా ఆ ముందు రాత్రి అడిగింది సుందరి -.'ఎలా ఉందండీ మా అక్కయ్య?' అని.

"పదిహేనురోజుల క్రితం అడగవలసిన ప్రశ్న" అనుకున్నాడు గంగాధరం మనసులో. చీమ కళ్ళు, దోమ ముక్కు, ఈగ నోరు, చిన్న సైజు

**వారంవారం కథాప్రభ**

పండిన గుమ్మడి కాయలా వున్న - ఆవిడా ఊర్వశి? "ఆపేరొకటి బాగా లేదు మార్చి చూడరాదూ?" సలహా ఇచ్చాడు గంగాధరం కొంచె ం సాహసించి.

సుందరి చెప్పింది సగం నిజం, సగం అబద్ధం. ఊర్వశి వయసేమో కాని పాతికేళ్ల దానిలా కనిపించదు. అది అబద్ధం. నలభై అయిదులా కన్పిస్తుంది - ఇది నిజం, అనుకున్నాడు.

సుందరికి ఒళ్ళుమండినా, మొగుడితో గొడవ పెట్టుకోలేదు. వాళ్లొచ్చేది రేపేనయ్యె. పోట్లాడి ఎడమొహం - పెడమొహంగా ఉంటే ఎట్లా? అన్యోన్యంగా కన్పించొద్దూ?!

***

సిటీలో అడ్రస్‌లు తెలుసుకోవడం కష్టమంటూ సుందరి ప్రొద్దుటే గంగాధరాన్ని స్టేషన్‌కి తరిమింది. సుందరికి నిలవలేనట్లుంది - దేవుడి దయవల్ల అక్కయ్యకి ఈ సంబంధం కుదర్చగలిగితే చుట్టపక్కాల్లో తనకెంత పేరు?! సుందరి లోపలికి, బయటికి తిరుగుతూ కొన్ని యుగాలు గడిపాక గంగాధరం వాళ్లొచ్చిన ఆటో ఇంటి ముందు ఆగిన శబ్దం విన్పించింది.

సుందరి చిరునవ్వుతో వాకిట్లోకి వెళ్లింది. మొగుడి చేతిలోంచి ఓ బ్యాగు అందిపుచ్చుకుని, మామగార్ని, బావగార్ని ఆప్యాయంగా లోపలికి ఆహ్వానించింది. బలరాంని చూసి "కొద్దిగా బట్టతల ఆరంభమైంది కాని, మనిషేమంత మారలేదు. అదీ హుందాగానే కన్పిస్తోంది ఆయనకి" అనుకొంది సుందరి మనసులో.

కుశల ప్రశ్నలు, పరామర్శలు అవుతుండగా అక్కగారికి వేడి వేడి కాఫీ తెమ్మని పురమాయించింది సుందరి. కాఫీలు తాగుతుండగా ఊర్వశిని పరిచయం చేసింది అతిథులకి. ఆమెదెంత మంచి మనసో, ఎవరికే అవసరవచ్చినా ఎట్లా ముందుకు దూసుకెళ్ళి తన సహాయమందిస్తుందో కొంచెం వివరించింది. తర్వాత చుట్టాలకి స్నానం ఏర్పాట్లు చూసేందుకు లోపలికెళ్ళి పోయింది ఊర్వశి, సుందరి ఆదేశంపై.

"మీరు మా ఇంటికి రావడం ఇదేగా మొదటిసారి? ఇల్లు చూద్దురుగాని రండి," అంటూ సుందరి మామగారికి, బావగారికి ఇల్లంతా తిప్పి చూపించింది.

"బాగుందమ్మా, ఇల్లు కట్టుకుని చాలా మంచిపని చేసేరు. జీవితంలో ఓ పెద్దపని పూర్తయినట్లే," మామగారు అభినందించేరు.

బలరాం ఏమీ వ్యాఖ్యానించలేదు కాని, తిరిగి హాల్లోకి వచ్చేక అడిగేడు గంగాధరాన్ని - "నీ లైబ్రరీ ఏదీ? చూపించలేదేం? అప్పట్లో మనం స్వంత సంపాదనొచ్చాక మంచి మంచి బుక్స్ కొని దాచుకోవాలి అనుకునేవాళ్లం కదూ?!"

గంగాధరం వెర్రిమొహం వేశాడు. నిజమే, చదువుకునే రోజుల్లో సాహిత్యం పట్ల ఎంతో అభిరుచి ఉండేది. తను, అన్నయ్య కలిసి లైబ్రరీ నుండి మంచి మంచి పుస్తకాలన్నీ తెచ్చుకుని చదివేవారు. కొన్ని కొన్ని పేజీలు చదివినవే మళ్లీ చదివి, కొన్ని వాక్యాల్ని అండర్ లైను చేసుకుని - గంటల తరబడీ వాటి గురించి చర్చించుకొంటూ గడిపేవారు. ఒక్కోసారి కొన్ని పుస్తకాలు తిరిగివ్వాలంటే అన్నయ్య ఎంత బాధపడి పోయేవాడో? అప్పట్లోనే అనుకున్నారు - స్వంత సంపాదనొచ్చాక నచ్చిన పుస్తకాలు కొనేసుకుని ఇంట్లోనే మంచి లైబ్రరీ ఏర్పాటు చేసుకోవాలని.

పెళ్ళయిన కొత్తల్లో కూడ అడపాదడపా చదువుతూనే ఉండేవాడు. ఆ తర్వాత్తర్వాత ఆ అలవాటు ఎప్పుడు అంతరించి పోయిందో తనకే జ్ఞాపకం లేదిప్పుడు. సుందరికి టీ.వి., సినిమాలు తప్ప మరో అభిరుచి లేదు. అందువల్ల తన జీవితంలోంచి కూడా పుస్తకాలు శాశ్వతంగా తప్పుకుపోయినయ్! అన్నయ్య మాత్రం బాగానే గుర్తు పెట్టుకున్నాడు. ఎందుకో చాలా దిగులేసింది గంగాధరానికి పాత రోజులన్నీ తలపుకు రాగానే.

భర్త ముఖం చూసిన సుందరికి పరిస్థితి అర్థమైపోయింది. "బావుందండీ, ఇల్లూ వాకిలీ, పెళ్ళాం బిడ్డలూ వచ్చాక ప్రతి రూపాయీ ఆచితూచి ఖర్చు పెట్టుకోవల్సిందే కదా? అడ్డమైన వాటి మీదా తగలేయాలంటే మీలాగా మాకెక్కడ కుదుర్తుందీ?" నవ్వుతూనే చురక వేసింది బావగారికి.

బలరాం నిర్ఘాంతపోయేడు - సుందరి మాటలకి కాదు, వాటిని ఖండించని గంగాధరం ధోరణి చూసి. ఆ తర్వాత కూడ అతను చాలాసార్లు నిర్ఘాంతపోవలసి వచ్చింది, పాపం!

పేరుకు స్వంత ఇల్లే కాని ఇంటి చుట్టూ ఓ పచ్చని మొక్కయినా కన్పించలేదు. వాళ్ల ఇంజనీరు కొంచెం కూడా స్థలం 'వేస్ట్' కాకుండా ఎంత బాగా ప్లాన్ చేసేడో సుందరి బోల్డుసార్లు చెప్పింది మురిసిపోతూ. అద్దెకిచ్చేందుకు ఓ పోర్షన్ కూడా ఉంది మరి ఆ నూటయాభై గజాల స్థలంలోనే. నీళ్లకి కటకట కాబట్టి మొక్కలు పెంచే ప్రశ్నే లేదు.

బలరాంకి చిన్న పిల్లలంటే ఆపేక్ష. అందువల్ల గంగాధరం కొడుకులిద్దర్నీ ఆప్యాయంగా దగ్గరకు పిలిచేడు. వాళ్ళు 'అంకుల్' అని పిలిస్తే 'వద్దు, చక్కగా పెదనాన్నా అని పిలవండి చాలు!" అని చెప్పేడు.

"వాళ్లు చదివేది ఇంగ్లీష్ మీడియం కదండీ? పెద్ద పెద్ద తెలుగు పదాలు నోరే తిరగవు" చెప్పింది సుందరి గర్వంగా.

బలరాం ఇదేమిటన్నట్లు గంగాధరం వైపు చూశాడు. గంగాధరం గమనించనట్లు కిటికీలోంచి బయటికి చూశాడు.

"మా వాళ్లక్కూడా మీలానే పాటలంటే చాల ఇష్టం. పెద్దాడు భలే పాడుతాడు. చిన్నాడైతే అచ్చం 'ప్రభుదేవా'లా డాన్స్ చేస్తాడు. ఏదీ చెయ్యరా, అంకుల్ చూస్తారు," సుందరి కొడుకుల్ని ప్రోత్సహించింది.

"వెంటనే పెద్దవాడు 'ఊర్వశీ, ఊర్వశీ,' అని పాటందుకుని ముక్కి, ముక్కి పాడుతోంటే రెండోవాడు కర్రపుల్లల్లాంటి కాళ్లూ చేతుల్ని గాలిలో ఎగరేస్తూ అష్టవంకర్లూ తిరిగిపోసాగేడు. ఈలోగా లోపల్నుండి ఊర్వశి వచ్చేసింది 'పిలిచేరా' అనడుగుతూ.

సోఫాలో ఇబ్బందిగా కదుల్తోన్న అన్నగారిని గంగాధరమే రక్షించేడు 'అన్నయ్య ఆఫీస్‌కి వెళ్లాలేమో?' అంటూ.

* * *

**తం**డ్రీ కొడుకులకి సేవలందించే బాధ్యత పూర్తిగా ఊర్వశికి అప్పగించేసింది సుందరి. కొడుక్కి నచ్చడమెంత ప్రధానమో తండ్రి అభిమానం సంపాయించుకోడం కూడా అంతే ప్రధానం కాబట్టి పెద్దాయన్ని జాగ్రత్తగా చూసుకోమని మరీమరీ చెప్పింది.

ఇక తనవంతు ప్రయత్నం తనూ ప్రారంభించింది. గంగాధరానికి ఉన్నదేమిటో, తనకొచ్చిన లోటేమిటో బలరాంకి కొట్టొచ్చేలా తెలిసేట్టు చేయాలనుకుంది.

ఉదయం నిద్రలేచాక - 'కాఫీ' ఆరోగ్యానికి మంచిది కాదని గంగాధరానికి పాలు, బూస్ట్ కలిపిచ్చింది. భోజనంలో విటమిన్లు ఉంటాయని తోటకూర వేపుడు, 'షుగర్' రాకుండా చేస్తుందని కాకరకాయ కూర తినిపించింది.

"ఓ వయసయ్యాక ఆరోగ్యాన్ని చాలా జాగ్రత్తగా కాపాడుకోవాలి," అంటూ బలరాంకి కూడ వడ్డించబోయింది చనువుగా.

కాని, ఊర్వశి కూడా తిరుగుతూ పెద్దాయన, కొడుక్కి ఏవిష్టమో చెప్పి మరీ చేయించేడు కాబట్టి నిర్మొహమాటంగా సుందరి కడ్డు వచ్చేడు. భార్యకి సహకరిస్తానని వాగ్దానం చేశాడు. కాబట్టి - గంగాధరం కళ్ల నీళ్ల పర్యంతమౌతూ, భార్య కంచంలో వేసిన వన్నీ 'మింగి' పడేసేడు చచ్చినట్లు.

రాత్రి భోజనాల తర్వాత తీరిగ్గా అన్నగారితో ముచ్చట్లు చెప్తూ కూర్చున్న మొగుడిని ముద్దుగా మందలించింది సుందరి, కట్టుకున్న తెల్లటి ఇస్త్రీ చీరని, తల్లో పువ్వుల్ని సర్దుకుంటూ. "ఆలస్యంగా నిద్రపోతే ఆయనకి సరిపడదు. 'ఎపిడిటీ ప్రాబ్లెం' ఉన్నదండీ" అంటూ బావగారికి క్షమాపణలు చెప్పింది.

భార్య కొంచెం 'ఓవర్ యాక్షన్' చేస్తున్నట్లన్పించింది గంగాధరానికి. అన్నగారి ముందు అట్లా భార్య వెనకాల పడగ్గదిలోకి వెళ్లడం 'సిగ్గు'గా అన్పించింది. లోపలికొచ్చాక అదే అన్నాడు భార్యతో "అన్నయ్య ఏమనుకుంటాడూ?" అని.

"ఏమనుకుంటారు? ఇట్లాంటప్పుడే మహబాగా తెలుస్తుంది ఆయన క్కావల్సిందేమిటో" సుందరి నవ్వుతూ, బాగా చప్పుడొచ్చేలా గాజుల్ని మోగిస్తూ మరీ కావలించుకుంది మొగుడిని. 'తనలాంటి ఇల్లాంలుంటే పొద్దున్లేచినప్పటి నుండి రాత్రి నిద్రపోయే వరకూ భర్తనెట్లా సుఖపెడుతుందో,' ఎట్లా కంటికి రెప్పలా కాచుకుంటుందో- బ్రహ్మాండంగా అర్థమౌతుంది బావగారికి అనుకున్నది సుందరి మహా నమ్మకంగా.

బలరాంకి ఆఫీస్ ట్రైనింగ్‌లోనే ఎక్కువ సమయం గడిచిపోయింది. అందరూ కలిసి బయటకు వెళ్లడానికి వీలుపడింది కాదు. పెద్దాయనను మాత్రం ఊర్వశి వెంట పెట్టుకెళ్లి మూణ్నాలుగు ప్రదేశాలు చూపించింది. అందుకే ఆఖర్రోజు సుందరి సినిమా ప్రోగ్రాం పెట్టింది. అదో గొప్ప హీరోగారి సినిమా - పేరు "అత్తా ! వస్తావా?"

ఆపేరు వింటూనే బలరాం ఉలికి పడ్డాడు. అతడు సినిమాలు చూసి చాలాకాలమైంది మరి. అతడు చూసిన ఆఖరు సినిమా - 'శంకరాభరణం' అని చెప్పగానే సుందరి ఆశ్చర్యపోయింది - ఇంతకాలం సినిమా చూడకుండా ఎట్లా బతగ్గలిగేడా అని.

"ఛీ, అదేం టైటిల్?" అని ముఖం చిట్లించిన బావగారి అజ్ఞానానికి జాలిపడ్తూ చెప్పింది -

"ఇప్పుడొస్తున్న సినిమాలన్నీ అట్లానే ఉంటున్నాయండీ. గయ్యాళి, గర్వపోతు అయిన అత్తగారింటికి ఇల్లరికం వచ్చిన హీరో, ఆవిడ పొగరణిచి, భార్యతో ఇంట్లోంచి వెళ్లిపోతూ, ఆఖర్న బుద్ధి తెచ్చుకున్న అత్తగార్ని అట్లా అడుగుతాడన్న మాట."


అసలు టిక్కెట్లే దొరకడం లేదట. గంగాధరం నానా అగచాట్లు పడి సంపాయించుకొచ్చేడట. బాగుండదని, తప్పనిసరై వెళ్లేడు బలరాం. హాల్లో బలరాం ప్రక్కన ఊర్వశి కూర్చునేలా చేయాలని సుందరి ప్రయత్నించింది కాని కుదర్లేదు.

సినిమా మహా 'ఇది'గా ఉంది. సుందరి బావగారి మనసు 'చెదర'గొట్టేందుకే ఈ సినిమా ఎంచుకున్నదసలు. మాటలు, పాటలు కూడా మహా బూతుల మూటలు - రెండర్థాల ప్రశ్నే లేదు. డైరెక్ట్ 'అదే' అర్థం. ఒక 'హీరో'కి ముగ్గురు 'హీరోయిన్లు' - ఇంక ఊళ్లో వేరే మగాళ్లే లేనట్లు ముగ్గురూ 'హీరో'నే ప్రేమిస్తున్నారు పోటీలు పడి మరీ. వాళ్ల డ్రెస్‌లు 'తువ్వాలుకి తక్కువా, కర్చీఫ్‌కి ఎక్కువా' అన్నట్లున్నయ్. ఆ పీలికల్ని నడుంకి చుట్టుకుని 'గాంగ్ రేప్' చేస్తున్న వాళ్ల మాదిరి 'హీరో' మీదికి ఎగబడ్తూ పాట పాడేస్తున్నారు. 'హీరో' కూడా మరీ కొంటెగా ఆ కాస్త పీలికల్నీ ఇప్పుడో, ఇంకాస్సేపటికో లాగేసేవాడి మాదిరి కలబడుతున్నాడు.

హీరోయిన్లు ఆరేసిన అందాలకి జనంలోంచి ఈలలు, చప్పట్లు - మరి కొందరు వీర సౌందర్యాభిమానులు రెచ్చిపోయి రంగుకాగితాలు, చిల్లర నాణాలు విసుర్తున్నారు తెరమీదికి. సుందరి తలతిప్పి చూసేప్పటికి బలరాం కొంచెం కూడా చలించకుండా వెనక్కి వాలి సీట్లో నిద్రపోతూ కన్పించేడు. తెరమీదికి కళ్లప్పగించి చూస్తున్న మొగుడిని డొక్కలో పొడిచింది విసుగ్గా. గంగాధరం నిర్దాక్షిణ్యంగా అన్నగార్ని నిద్ర లేపేడు.

ఈసారి మరీ ఘోరంగా ఉంది తెరమీద. హీరో, హీరోయిన్లు, అత్తగారు, వదిన్లు - ఇట్లా అందరూ కలిసి గంతులేస్తున్నారు. పెద్ద పెద్ద పళ్ల గుట్టల్లోంచి హీరో రకరకాల పళ్లు తీసుకుని వాళ్ల గుండెల మీదికి, బొడ్డుమీదికి గురిచూసి విసుర్తూ మహా దరిద్రమైన పాట పాడుతున్నాడు.

మళ్లీ నిద్రపోయేడు బలరాం. ఆఖర్న ఫైటింగ్ సీన్లో లేపేడు గంగాధరం. హీరో భూమ్మీదున్న అన్ని రకాల వాహనాల మీద ప్రయాణిస్తూ మరీ చితక బాదుతున్నాడు విలన్ అనుచరుల్ని. హఠాత్తుగా కారులోంచి మాయమై గుర్రమ్మీదెక్కి



"మా ఇల్లు ఓమినీ గవర్నమెంటు లాంటిది. మా ఆవిడ హోమ్ మినిష్టరు. మా అమ్మాయి ఇన్ఫర్మేషన్ మినిష్టరు. మా అబ్బాయి ఎక్స్‌టర్నల్ ఎఫైర్స్ మినిష్టరు."

"అలాగా. ఇంటరెస్టింగుగా ఉంది. మరి నువ్వు?" అడిగాడు శరత్‌ని ఫ్రెండు, అతడి మాటలు విని.

"పబ్లిక్ సర్వెంటుని"

**పి. సరోజ** (అమలాపురం)

రోడ్డు మీంచి కాక షాపుల్లోంచి, పెద్ద పెద్ద మేడల మీంచి ప్రయాణించి అడవిలో విలన్ని చేరుకున్నాడు. అక్కడ చెట్ల కొమ్మల్నుచి భూమికి పదడుగుల ఎత్తున గాలిలో వేలాడదీసిన హీరో యిన్లని, విలన్ 'రేప్' చెయ్యబోతుంటే హీరో వాడిని చావబాది, భుజాల్నరికీ, కాళ్ల విరక్కొట్టీ - ఆఖర్న పేద్ద కత్రని పొట్టలో గుచ్చి చంపై బోతుంటే అప్పుడు పోలీసులు గాల్లో పిస్తోలు పేల్చుకుంటూ వచ్చి "యూ ఆర్ అండర్ అరెస్ట్" అంటూ విలన్ని లాక్కెళ్లేరు.

తర్వాతి సీన్లో హీరో, హీరోయిన్లూ - శోభనం గదీ - ఒకరు 'నేను పాలు' అంటే, మరొకరు 'నేను టీపొడి' అని, ఇంకొకరు 'నేను చక్కెర' అని సిగ్గుపడ్తూ చెప్తారు.

'అమ్మో, ఇప్పుడు నేను మాంఛి 'టీ' చేసుకోవా లన్న మాట అయితే' అని వారితో భయం నటించి - గది బయట నిలబడి చోద్యం చూస్తున్న అత్తగారికి కన్నుకొట్టి 'అత్తా! వస్తావా? 'స్టౌ' ఒక్కటే తక్కువైంది' ' అనడుగుతాడు చిలిపిగా.

"అల్లుడూ ప్లీజ్, మీ అత్తని మాత్రం నాకొదిలేయ్" అని మామగారు దీనంగా ముఖం పెట్టి అడుగుతూ తనవేపు లాక్కుంటాడు.

అందరూ గొల్లని ఆనందిస్తూండగా సినిమా పూర్తయింది. "ఇదా సినిమా? బలరాంకి విపరీతమైన తలనొప్పి వచ్చింది. ఏమైపోయారు ఆ మల్లీశ్వరులు, బంగారు పాపలూ, దేవదాసులూ? మనసున మల్లెల మాలలూపటం సంగతి అటుంచి ఇట్లా మంటలు రేపుతున్నారేం? గంగాధరం గాడి బుద్ధేమైందసలు? పిల్లల్నేసుకుని ఇట్లాంటి బూతు సినిమాలకా వచ్చేది?" తమ్ముడిని మొహం వాచేలా చీవాట్లు పెట్టాలన్పించింది.

కాని, ఆశ్చర్యంగా తండ్రితో సహా అందరూ ఆ సినిమాలోని ముచ్చట్లు, కుళ్లు జోకులే తల్చుకుని తల్చుకుని నవ్వుకుంటున్నారు ఇంటికొచ్చాక కూడా. పిల్లాడప్పుడే పాడేస్తున్నాడు "పిల్ల పొంగు పాలకుండ, పట్టాలి దాన్ని వదలకుండ" అని.

"మావాడు ఏకసంథాగ్రాహి. ఒక్కసారి వింటే చాలు" - సుందరి పొంగిపోయింది.

★ ★ ★

మర్నాడే తండ్రీ కొడుకుల ప్రయాణం -

"ఎట్లా ఉంటుందో ఇక్కడ అని కాస్త మొహమాట పడ్తూనే వచ్చాం కానీ, మా గంగాధరం అదృష్టవంతుడమ్మా. నీలాంటి మంచి భార్య దొరికింది. మీ అక్కయ్య కూడా మా కోసం చాలా శ్రమ పడింది పాపం! మీ అందరూ వీలు చూసుకుని ఓసారి మాఇంటికి వచ్చి తీరాలి," పెద్దాయన మనస్ఫూర్తిగా ఆహ్వానించేడు.

సుందరికి 'ఎవరెస్ట్' ఎక్కినంత సంబరమైంది తను 'ఘనవిజయం' సాధించినందుకు. అసలు విషయం కదపమన్నట్లు భర్తకి కళ్లతోనే సైగ చేసింది. కాని, అందరి ముందూ ఆ విషయం అడిగేందుకు గంగాధరానికి ధైర్యం చాల్లేదు. అందుకే స్టేషన్లో అన్నగార్ని బండెక్కించాక, నెమ్మదిగా భార్య మనసులో మాట అతని చెవిన వేశాడు. అన్నగారు ఓ ఇంటివాడై, తనలా సుఖశాంతుల్తో సంసారం చేసుకుంటూ వుంటే ఎంతో బావుంటుందని మరీ మరీ చెప్పేడు. 'ఊర్వశి' విషయం చూచాయగా అందించేడు. అంతా విని బలరాం - 'వెళ్లాక ఉత్తరం రాస్తా!' అన్నాడు క్లుప్తంగా. ఆ మాత్రానికే చాల సంతోషించేడు గంగాధరం.

వాళ్లు వెళ్లాక వారం రోజులకి - సుందరి కూడా మొగుడితో పాటు ఒళ్లంతా కళ్లు చేసుకుని ఎదురు చూస్తూండగా వచ్చినయ్ - ఒకటి కాదు, రెండుత్తరాలు. అన్నగారి ఉత్తరం మొదట విప్పేడు గంగాధరం.

"డియర్ గంగా!


నీ ప్రతిపాదన గురించి చాలా ఆలోచించిన మీదటే రాస్తున్నాను. నా నిర్ణయాన్ని నేనెప్పటికీ మార్చుకోవల్సిన పనిలేదని మీ ఇంటికొచ్చాక నాకు బాగా అర్థమైంది. నువ్వు ఆనాటి గంగాధరానివి కాదు. జీతం, జీవితం - ఏదీ నీది కాదు. పెళ్లంటే భార్యభర్తల్లో ఎవరో ఒకరు తప్పని సరిగా వ్యక్తిత్వపు వెన్నెముకని విరక్కొట్టుకోవటమే అన్న నా నమ్మకం ఇప్పుడింకా బలపడింది. అందుకతీతంగా వెళల్లోనో, లక్షల్లోనో ఎవరేనా ఒక జంట ఉంటే వారికి నా అభినందనలు!

"ఎదుటి వారికి నచ్చినట్లు కాక - ఇలా నాకు నచ్చినట్లు నాకోసం నేను బతక గలగడం - చాలా బాగుంది. నేను చాలా సుఖంగా, సంతోషంగా ముఖ్యంగా - స్వేచ్ఛగా ఉన్నాను. వాటిని నేను పోగొట్టుకోను. మీ దంపతులు మాపట్ల చూపిన ఆదరాభిమానాలకి కృతజ్ఞతలు ! నా నిర్ణయం మీ శ్రీమతికి ఆశాభంగం కలిగిస్తే - క్షమాపణలు!

"అన్నట్లు నీకోసం నేతెచ్చిన 'బహుమతి'ని నీకివ్వలేదు - నీ ఇంట్లో పుస్తకాలకి, పూల మొక్కలకి స్థానం లేదన్న నిజం నన్ను, నేను తెచ్చిన పుస్తకాలని బయటికి తియ్యనివ్వలేదు. ఈ ఉత్తరంతోపాటు పదిహేను వందలకి డి.డి. పంపిస్తున్నా! నీ శ్రీమతికి నచ్చిన వస్తువు కొనగలవు.

"ఇట్లు

"బలరాం."




గంగాధరం ఆ ఉత్తరాన్ని భార్యకందించి, రెండో ఉత్తరం తెరిచేడు.

అది పెదనాన్న రాసింది -

"చిరంజీవి గంగాధరానికి,

"మీ ఇంటి నుండి వచ్చినప్పటినుండీ నాకు తీరని వెలితిగా తోస్తున్నది. 'ఇంటికి దీపం ఇల్లాలన్నారు. మాది ఏనాటి నుండో 'దీపం' లేని ఇల్లని నీకు తెల్సు. ఇన్నేళ్ల నా ఒంటరి జీవితం వల్ల నేనేం పోగొట్టుకున్నానో మీ దంపతుల్ని చూసాక నాకు బాగా అర్థమైంది. ఎన్ని ఉన్నా - భార్య లేని జీవితం ఉప్పులేని కూర మాదిరి బహు చప్పన అన్న జ్ఞానం నాకిప్పటికి కలిగింది. ఇప్పటికైనా నాకేమంత వయసైందని? అరవై అయిదింకా నిండలేదు కూడా. నాకన్నా పెద్ద పెద్ద వాళ్లే మళ్లీ పెళ్లి చేసుకుంటున్న కాలమిది. పైగా నా ఆరోగ్యం కూడా మహా భేషుగ్గా ఉంది. అందుకే నేనే ఈ ఇంట్లో 'దీపం' పెట్టగల ఆడదిక్కును తెచ్చు కోవాలను కుంటున్నాను. ఇంతకాలానికి నాలో ఈ 'పెళ్లి' వాంఛని కలిగించింది, రగిలించిందీ మీరే.

"ముఖ్యంగా రాసేదేమంటే - ఊర్వశి సేవలు నాకు చాలా నచ్చినయ్. ఆమెని మరిచిపోలేక పోతున్నా. ఆమెకూ్కుడా నేను నచ్చినట్లే అన్పించింది. మీకేమీ అభ్యంతరం లేకపోతే - ఈ శుభకార్యం మీ చేతుల మీదుగా జరుప గలిగితే, నా అంత అదృష్టవంతుడు మరొకడుండరని భావిస్తున్నా !

"అమ్మాయికి, చిరంజీవులకు ఆశీస్సులు. మీ జవాబు కొరకు వెయ్యి కళ్లతో ఎదురు చూస్తూ -

"మీ పెదనాన్న".

లోపల్నుండి తన్నుకొస్తున్న నవ్వుని ఆపు కొంటూ, గంభీరంగా మొహం పెట్టి - రెండో ఉత్తరాన్ని కూడ భార్యకందించేడు.

"అందుకే మీ వాళ్లంటేనే నాకొళ్లు మంట. పెద్ద మనుషులూ, కొద్ది బుద్దులూ," సుందరి, ఉత్తరం చదివి ఉండచుట్టి విసిరేస్తూ మండిపడింది మొగుడి మీద. ●